క్లుప్తంగా

పూలే జయంత్యుత్సవ కమిటీ కో- ఆర్డినేటర్‌గా రాజేందర్



జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో మాదేశి రాజేందర్

ముషీరాబాద్: ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యుత్సవ కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ముషీరాబాద్‌కు చెందిన మాదేశి రాజేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పూలే జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్ష



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి: ఎస్సై రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏవీ కాలేజీ సెంటర్‌లో శనివారం జరిగిన పరీక్షలో 996 మంది అభ్యర్థులకు 971 మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారని ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్, ఎస్సై నాగరాజు తెలిపారు. 25 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, అదనపు డీసీపీ రమణారెడ్డి, పరీక్ష కేంద్రం నోడల్ అధికారి డీసీపీ కృష్ణయ్య, చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

◆ పరీక్ష రాయడానికి వచ్చిన మహిళా అభ్యర్థిని వారి పసిబాలుడిని చిక్కడపల్లి మహిళా కానిస్టేబుల్ ఫైరోజ్ మీర్ ఎత్తుకుని ఆడించి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఢిల్లీకి తరలిన ట్రేడ్ యూనియన్ నేతలు

కాచిగూడ: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా 'వి.వి.గిరి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లేబర్ అండ్ ట్రేడ్ యూనియన్ లీడర్ షిప్' పనిచేస్తుందని ఇనిస్టిట్యూట్ మాజీ సభ్యులు కృష్ణమూర్తి అన్నారు. ఢిల్లీలో జరుగనున్న శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు శనివారం సికింద్రాబాద్ నుంచి ఎంపికైన 43 మంది కార్మికులు రైల్లో తరలివెళ్లారు. బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ప్రశ్న పత్రాల లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలి



ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ముషీరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీపై సీబీఐచే విచారణ జరిపించాలని వైఎస్‌ఆర్‌టీపీ ముషీరాబాద్ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో తెలంగాణ సేవ్ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ లీకేజీ కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3016 నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. షంషుద్దీన్, మునిరాం నాయుడు, ఆయూబ్‌ఖాన్, కిషన్, ప్రశాంత్, సురేష చందు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 4 మెటీరియల్ అందజేత

ముషీరాబాద్: తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా 100 మంది పేద విద్యార్థులకు గ్రూప్–4 మెటీరియల్‌ను శనివారం లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. అధ్యక్షులు యాదయ్య మాదిగ పిలుపు మేరకు అందజేశామని తెలిపారు. దళితులు చదువుకు దూరం అవుతున్నారని 2023–24 విద్యా సంవత్సరంలో పేద విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గజ్జల సూర్యనారాయణ, మాదిగ రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు సంపూర్ణమాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సరస్వతి, అశోక్, రాణిలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ సహకారంతో మెటీరియల్‌ను అందజేశామన్నారు. జయశీల, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో జాగ్రత్త !

- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి
- రోగులకు ప్రథమ చికిత్స అందించాలి
- నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె. శంకర్



నల్లకుంట: నగరంలో వేసవి తాపం తీవ్ర రూపం దాల్చుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోత కారణంగా ఉదయం 9 గంటలకే పిల్లలు, పెద్దలు బయట తిరగాలంటే వడదెబ్బ తగులుతుందని బయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్ సాక్షి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: సాధారణంగా వడదెబ్బ తగలడానికి కారణాలు ఏమిటి ?

జవాబు: ఎండ తీవ్రత కారణంగా శరీరంలోని తేమ శాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీని ప్రభావం మెదడుపై పడుతుంది. మెదడులో వేడిని నియంత్రించే సాధనం వేడికి గురవుతుంది. దీన్నే వడదెబ్బ అంటారు.

ప్రశ్న: వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

జవాబు: రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీళ్లు తాగాలి. బయటకు వెళ్లే సమయంలో నీళ్ల బాటిల్ తీసుకెళ్లడం మంచిది.

ప్రశ్న: వడదెబ్బ లక్షణాలు ఎలా ఉంటాయి ?

జవాబు: వడదెబ్బ తగిలిన వెంటనే నాలుక తడి ఆరిపోతుంది. శరీరంలోని ఉష్ణోగ్రతల్లో తేడాలు ఏర్పడతాయి. విరేచనాలు, వాంతులు ప్రారంభమవుతాయి. ఈ లక్షణాలు వచ్చిన వెంటనే అది వడదెబ్బ అని గుర్తించాలి. వడదెబ్బకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి తరలించాలి.

ప్రశ్న: వడదెబ్బ సోకిన వ్యక్తిలో మార్పులు ఎలా ఉంటాయి ?

జవాబు: వాతావరణంలో వేడి కారణంగా శరీరంలో ఉన్న లవణాలు, సోడియం, క్లోరైడ్ శాతం తగ్గిపోతాయి. డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో చాలా సమయం పనులు చేస్తే ఇలా జరుగుతుంది.

ప్రశ్న: వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఎలాంటి చికిత్సలు అందించాలి ?

జవాబు: వడదెబ్బ సోకిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశంలోకి తరలించాలి. తడి బట్టతో ఒళ్లంగా తుడిచి నీళ్లు తాగించాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. అప్పుడు కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.

ప్రశ్న: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు ఉన్నాయా ?

జవాబు: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ఐవీ ఫ్లూయిడ్స్ కూడా అవసరమైన మేరకు ఉన్నాయి. నార్మల్ సెలైన్(ఎన్ఎస్), రింగర్ లాక్టేడ్(ఆర్ఎల్) అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: అవగాహన కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా ?

జవాబు: వడదెబ్బ భారినపడకుండా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రశ్న: పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

జవాబు: చిన్న పిల్లలు వీలైనంత వరకు ఎండలో తిరగకుండా చూసుకోవాలి. అవసరమైతే కాళ్లకు చెప్పులు, తలకు టోపీ ధరించాలి. నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలి.

ప్రశ్న: కూలీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

జవాబు: కూలీలు పనులకు వెళ్తే చల్లని సమయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయడం మంచిది. తలపాగా, పలుచని తెల్లని దుస్తులు ఉపయోగిస్తే వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చు.

ప్రశ్న: ఏ వయస్సు వారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది ?

జవాబు: ముఖ్యంగా 60 ఏళ్లు నిండిన వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు ఎక్కువగా వడదెబ్బ సోకే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి ?

జవాబు: ముఖ్యంగా శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. వీటిని తీసుకోవడం ద్వారా దాహం తీరదు. ఐస్‌క్రీమ్‌లు తినకుండా ఉండడం మంచిది. మసాలా, నూనె వస్తువులు తినకపోవడం శ్రేయస్కరం. ముదురు రంగు దుస్తులు వాడకపోవడం మంచిది.

ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా నిరసనలు



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సీపీఎం నిరసన ప్రదర్శన

ముషీరాబాద్: 'విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ గో బ్యాక్ అంటూ'.. సీపీఎం నాయకులు, కార్యకర్తలు గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, సింగరేణి ప్రైవేటీకరణను ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదని పోలీసులు వారితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో తిరిగి ప్రదర్శనను కొనసాగించారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింహ్మారావు, జ్యోతి తదితరులు మాట్లాడారు. 'ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేస్తూ.. కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని' విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రవికుమార్, ఆర్.శ్రీరామ్‌నాయక్, టి.స్కైలాబ్‌బాబు, జె.బాబురావు, ప్రసాద్, ఎం.అడవయ్య, నగర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలను ధరించి శనివారం సుందరయ్య పార్కు వద్ద నిరసన చేపట్టారు. 'మోదీ గో బ్యాక్' అంటూ నల్ల బెలూన్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్‌లు మాట్లాడుతూ.. 'నిరుద్యోగులను మోసం చేసిన ప్రధాని మోదీకి తెలంగాణలో పర్యటించే హక్కులేదని' విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, వివిధ సంఘాల నాయకులు ఎం.డి.జావిద్, కొమ్ము విజయ్, లెనిన్ ఖుబేరా, పవన్, వీరేందర్, స్టాలిన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం'



రైతు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న టి.సాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 'రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ.. సహకార శాఖను ఏర్పాటు చేసి పెట్టుబడిదారులకు వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని' తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ యూనియన్ రాష్ట్ర మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మల్టీ స్టేట్ లెవల్ కో– ఆపరేటివ్ చట్టాన్ని తీసుకొచ్చి గ్రామీణ వ్యవస్థలో ఉన్న సహకార సంఘాలన్నింటిని ప్రైవేటుపరం చేసేలా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

◆ సహకార సంఘ ఉద్యోగులు, రైతులు ఈ విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

◆ సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని జీవో నెంబర్ 44ను తీసుకొచ్చి వీరికి వేతనాలు, రావాల్సిన గ్యాడ్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, హెల్త్ బెనిఫిట్స్ అమలు చేయడంలో విఫలమైందన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షులు భూపాల్, ఎం.డీ.సర్దార్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడ్ ఉపాధ్యక్షులు రాందాస్, నరేందర్‌రెడ్డి, వెంకటస్వామి, మీస్సార్ అహ్మద్, ఎం.రవీందర్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

'గిరిజన ఎంపీ స్థానాల్లో ఎన్నికలను బహిష్కరిస్తాం'



మాట్లాడుతున్న గిరిజన రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు

గిరిజన రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ వెల్లడి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం గిరిజన సమస్యల పరిష్కారానికి అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గిరిజన స్థానాల్లో ఎన్నికలను బహిష్కరిస్తామని సేవాలాల్ సేన వ్యవస్థాపకులు, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి (జీఆర్ఎస్ఎస్) చైర్మన్ భూక్యా సంజీవ్‌నాయక్ అన్నారు.

◆ ప్రధాని హైదరాబాద్ పర్యటన సందర్భంగా బాగ్‌లింగంపల్లి సేవాలాల్ సేన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

◆ బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీ, నియోజకవర్గాల పునర్విభజన చేస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే రాష్ట్రానికి రావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

◆ గిరిజన జనాభా దామాషా ప్రకారం గిరిజన రిజర్వేషన్లను 7.5 నుంచి 10 శాతానికి పెంచకపోవడంతో పాటు సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేయడం ద్వారా కార్మికులకు తీరని అన్యాయం జరగుతుందన్నారు. గిరిజనులకు రాష్ట్రపతి పదవీ ఇచ్చినంత మాత్రాన మొత్తం గిరిజనులకు మేలు చేస్తున్నట్లుగా కాదని హితవు పలికారు. సేవాలాల్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వడిత్యా కల్యాణ్‌నాయక్, హోబానాయక్, మున్నానాయక్, బాలునాయక్, శ్రీను, కృష్ణ, చందు, రాజు తదితరులున్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని ఫాతిమా బేగం మసీద్ వద్ద ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్ పేదలకు నిత్యవసర వస్తువులతో పాటు బట్టలను పంపిణీ చేస్తున్నారన్నారు. ముఠా జైసింహ, మసీద్ అధ్యక్షులు మహ్మద్ జహంగీర్, మహ్మద్ ఖదీర్, గౌస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్యామ్‌సుందర్, మల్లికార్జున్‌రెడ్డి, కొండపల్లి మాధవ్, సురేందర్, ఖలీల్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ గోల్నాక డివిజన్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నెంబర్ చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, పార్టీ అధిష్ఠాన పరిశీలకులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి గోల్నాక డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక..



పులిజాల గెల్వయ్య

అంబర్‌పేట: సుదీర్ఘ కాలంగా వామపక్ష పార్టీలో పని చేసిన పులిజాల గెల్వయ్య ఈరోజు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. అంబర్‌పేట నియోజకవర్గంతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వామపక్ష పార్టీల తరపున ప్రజల పక్షాన పోరాడినట్లు ఆయన శనివారం పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మంత్రి తలసాని సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.

ప్రధానిని కలిసిన స్థానిక నేతలు



ప్రధానితో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు



ముషీరాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఎం.రమేష్‌రామ్

కాచిగూడ: నగరానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీని శనివారం సికింద్రాబాద్‌లో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ నేతలు కేశబోయిన శ్రీధర్, వినోద్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, నందకిషోర్‌యాదవ్, వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభలో పాల్గొని తిరిగి వెళ్లే సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్టులో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అసెంబ్లీ కన్వీనర్లను ప్రధానిని కలిశారు. మొత్తం 32 మంది అసెంబ్లీ కన్వీనర్లు ప్రధానిని కలిసే కార్యక్రమాన్ని సమన్వయం చేసేందుకు ముషీరాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఎం.రమేష్‌రామ్‌కు బీజేపీ అధిష్ఠానం బాధ్యతలను అప్పగించింది.

వేద పాఠశాల విద్యార్థుల స్వాగతం..

కాచిగూడ: రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నగరానికి వచ్చిన సందర్భంగా కాచిగూడలోని ఉత్తరాధి మఠం వేద పాఠశాలకు చెందిన వేద విద్యార్థులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ప్రధానికి ఘన స్వాగతం పలికారు. శనివారం ఉత్తరాది మఠం పగడాల జయతీర్థాచార్యులు, పద్మనాభాచార్యుల శిష్యులు పరేడ్ గ్రౌండ్స్ వద్ద సభా ప్రాంగణంలో వేదం, శాంతి మంత్రం పఠించారు. చిన్నారులు వేదం పఠించిన విధానం చూసి ప్రధాని, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, భారతీ రమణాచార్య, గోపాలాచార్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను విరమించుకోవాలి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రైవేటీకరణ ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, నాయకులు డిమాండ్ చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా పలువురు నేతలు దానకర్ణచారి (డీఆర్‌డీఎల్), పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ (బీఎస్ఎన్ఎల్), రవికుమార్ (హెచ్‌సీఎల్), సురేందర్ (హెచ్ఎంటీ), బాలయ్య (పోస్టల్), రామూర్తి (రైల్వే), నర్సింగ్ ముదిరాజ్ తదితరులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ, పోస్టల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రధాని బహిరంగ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో..



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్ ఆధ్వర్యంలో..



రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుంచి..

కాచిగూడ: కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బండారు సంతోష్ కుమార్, భీమ్‌రాజ్, సుభాష్ పటేల్, ఎస్.రవియాదవ్, హజారిబాబు, సునిల్, మల్లికార్జున్, బల్వీర్, అరవింద్, నర్సింగ్‌రావు, కేసరి నర్సింగ్‌యాదవ్, సూరి, నాగు, లావణ్య, సారిక, శాంతాబాయి తదితరులున్నారు.

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో శ్రీకాంత్, ఉమేష్, వీఎస్టీ రాజు, పాలశ్రీను, ఆకుల సురేందర్, ఎం.శ్రీనివాస్‌రావు, సత్తిరెడ్డి, శివకృష్ణ , మహిళలు తదితరులు తరలివెళ్లారు.

ముషీరాబాద్: అడిక్‌మెట్, ముషీరాబాద్, రాంనగర్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్ తదితర డివిజన్‌ల నుంచి మొత్తం ఆరు వేల మంది తరలివెళ్లినట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ తెలిపారు. ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రీయనవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు బద్రీనారాయణ, కొనిన్యప్రసాద్, సూర్యనారాయణశర్మ, బాబు, నరేష్, శ్యామ్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీతో పాటు పలువురు నాయకులు బహిరంగ సభలో పాల్గొన్నారు.



ప్రధాని బహిరంగ సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షులు గుండగానీ భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు భారీ వాహనాలలో ర్యాలీగా తరలివెళ్లారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు కలకోట అరుణ్, సీనియర్ నాయకులు కిరణ్, భరత్‌భూషణ్, లల్లూ, రాంరాథోడ్, రఘువీర్, సతీష్, ప్రవీణ్‌లతో పాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

◆ ఎన్విరాన్‌మెంట్ రాష్ట్ర మాజీ కన్వీనర్ సి.పార్థసారధి ఆధ్వర్యంలో కె.అరుణ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, గడ్డం సతీష్‌యాదవ్‌లతో పాటు పలువురు మహిళలు బస్సుల్లో ర్యాలీగా తరలివెళ్లారు.

నల్లకుంట: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మోదీ బహిరంగ సభకు నల్లకుంట నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శులు బి.సురేష్‌యాదవ్, పాతకోటి మహేష్, బీజేవైఎం నగర నాయకుడు ఎస్.రాంజగదీష్ ముదిరాజ్, మాచర్ల అర్జున్ తదితరులున్నారు.

అంబర్‌పేట: రెడ్ బిల్డింగ్ చౌరస్తా నుంచి కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు చుక్క జగన్, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, అచ్చిని రమేష్ తదితరులు ఉన్నారు. అంబర్‌పేట డివిజన్ నుంచి నాగభూషణంచారి, భిక్షపతి, ఆనంద్‌గౌడ్, యశ్వంత్ తదితరులున్నారు. గోల్నాక డివిజన్ నుంచి మూల రవీందర్‌గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ గుండు బీజేపీ నాయకులు, కార్యకర్తలు



కార్పొరేటర్ సుప్రీయనవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో..



ర్యాలీని ప్రారంభిస్తున్న గుండగొని భరత్‌గౌడ్

అభివృద్ధి పనుల పరిశీలన

కవాడిగూడ: పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజీ పైపులైన్‌ల ఆధునీకరణకు తగిన చర్యలు చేపట్టి కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. బండమైసమ్మనగర్‌లో అభివృద్ధి పనులకు తగిన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 2 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ రోడ్ల నిర్మాణానికి పనులను చేపట్టామన్నారు. బస్తీలోని అన్ని వీధుల్లో జనాభాకు అనుగుణంగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ శ్రీధర్, వల్లాల శ్యామ్‌యాదవ్, రాములు, సంతోష్, మహేష్, భాను, కిట్టు, లవకుమార్, సురేందర్, రుద్రసురేష్, రాజేష్, బాలకృష్ణ, లత, రాములు తదితరులున్నారు.

మహిళ అదృశ్యం



రమ్య (ఫైల్)

నల్లకుంట: ఓ ప్రైవేట్ హాస్టల్‌లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మొగిలిచర్ల రవి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లికి చెందిన చల్ల రమేష్, మల్లేశ్వరి కుమార్తె చల్ల రమ్య (29)కు వివాహమైంది. కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో పిల్లలిద్దరినీ తల్లిదండ్రుల వద్ద ఉంచిన రమ్య ఉన్నత చదువు, ఉద్యోగం కోసం నగరానికి వచ్చింది. శివం రోడ్డులోని ఓ కన్సల్టెన్సీలో ఉద్యోగం చేస్తూ.. నల్లకుంటలోని ఓ లేడీస్ హాస్టల్‌లో గతేడాది నవంబర్ నుంచి పేయింగ్ గెస్ట్‌గా ఉంటోంది. కుటుంబ సమస్యలు, తండ్రి అనారోగ్య సమస్యల కారణంగా హాస్టల్ ఖాళీ చేస్తున్నానని హాస్టల్ నిర్వాహకులతో చెప్పి ఈ నెల 7న ఉదయం 7.30 హాస్టల్ ఖాళీ చేసి వెళ్లినట్టు సమాచారం. అదే రోజు సాయంత్రం ఆమె తల్లిదండ్రులు హాస్టల్ నిర్వాహకురాలు ఎన్. పద్మశ్రీకి ఫోన్ చేసి తమ కూతురు ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో ఆమెకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వారి విజ్ఞప్తి మేరకు హాస్టల్ నిర్వాహకురాలు శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.